

మల్కాపురంలో జలమయమైన రహదారి



వర్షపు నీటిలో ఐవోసీ సర్వీస్ రోడ్డు



శ్రీహరిపురంలో తడిసి ముద్దయిన రోడ్డు



కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే రహదారిపై నిలిచిన వర్షపు నీరు

వాన.. హైరానా

- తడిసి ముద్దయిన నియోజకవర్గం
- లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయం
- తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలు
- వర్షంలో పాదచారులు, వాహన చోదకుల తంటాలు



కోరమాండల్ ప్రాంతంలో గొడుగుతో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

గోపాలపట్నం: అల్పపీడన ప్రభావంతో శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. గోపాలపట్నం పరిసర గ్రామాలు తడిసి ముద్దయ్యాయి. వరద నీరు వెళ్లేందుకు కాలువలు సరిగా లేకపోవడంతో రోడ్లపైనే నీరు నిలిచిపోయింది. 91, 92, 89 వార్డుల్లోని గోపాలపట్నం, కొత్తపాలెం, చంద్రనగర్ ప్రాంతాల్లో వర్ష ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గోపాలపట్నం శ్మశానవాటిక సమీప పెట్రోల్ బంక్ వద్ద వర్షం నీరు, మురుగు నీటితో కలిసి రోడ్డుపైనే నిల్వ ఉండిపోయింది. ఈ దారిలో రాకపోకలు సాగించిన వాహన చోదకులు, పాదచారులు నరకం చూశారు.

ముంపుపై స్థానికుల ఆందోళన

కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే రోడ్డులో ఎక్కడికక్కడ మోకాలి లోతులో వర్షపు నీరు నిల్వ ఉండటంతో వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. ఎగువ నుంచి వచ్చే వర్షం నీరు రహదారులపై ప్రవహిస్తోంది. వర్షాలు మరో రెండు మూడు రోజులు పడితే ఈ ప్రాంతం ముంపునకు గురయ్యే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దీనిపై తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చెరువులా చంద్రనగర్ అండర్ పాస్‌వే

చంద్రనగర్ నుంచి పాత గోపాలపట్నం వెళ్లే అండర్ పాస్‌వే వర్షం నీటితో మోకాలి లోతులో నిండిపోయింది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. రైల్వే అధికారులు వర్షం నీటిని మోటార్లతో తోడించే పనిచేపట్టారు.

పారిశ్రామిక ప్రాంతంలో నీట మునిగిన రహదారులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి పలు రహదారులు నీటి మునిగాయి. శ్రీహరిపురం, కోరమాండల్ ప్రాంతంలోని సర్వీస్ రోడ్లు తడిసి ముద్దయ్యాయి. వాహనాలు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. మల్కాపురం సమీపాన గల ఐవోసీ సర్వీస్ రోడ్డు జలమయమైంది. ఇక్కడ గెడ్డలో నీరు పోయే మార్గం లేక దానికి ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డుపైకి వచ్చి చేరింది. ఆ మార్గాన ఐవోసీ టెర్మినల్ ప్లాంట్‌కు ఆయిల్ లోడింగ్‌కు వచ్చే లారీల చక్రాలు నీటిలో మునిగిపోయాయి. ఐవోసీలోకి వర్షపు నీరు చేరింది. ఇక్కడ హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ) సంస్థ విస్తరణ పనులు జరుగుతున్న ప్రదేశంలో వర్షం నీరు భారీగా చేరింది. దీంతో కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.



చంద్రనగర్ అండర్ పాస్‌వేలో నిలిచిన వర్షపు నీరు



కొత్తపాలెం - నరవ రహదారిలో పారుతున్న వాన నీరు



గోపాలపట్నం మెయిన్ రోడ్డులో వర్షంలో ప్రయాణిస్తున్న ప్రజలు

కొండవాలులో కలవరం..

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇక్కడి కొండవాలు ప్రాంతాల వాసులు కలవరం వ్యక్తం చేశారు. ఎక్కడ కొండచరియలు విరిగి తమ ఇంటిపై పడతాయోనని భయందోళనలు వ్యక్తం చేశారు. కొండవాలు ప్రాంతాల్లో మట్టి దిబ్బలు విరిగిపడ్డాయి. పలు ప్రాంతాల్లో కాలువలు, గెడ్డలు పొంగిపొర్లాయి. మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపం వద్ద గెడ్డలో మురుగు నిలిచిపోవడంతో మురుగు నీరు సర్వీస్ రోడ్డు వైపు వచ్చి చేరింది. 58వ వార్డు రామ్‌నగర్ వద్ద గల గెడ్డ పొంగింది.

రక్షణ రంగ కార్మికుల సమస్యలపై నిరసన



నేవల్ డాక్‌యార్డ్ గేటు వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

సింథియా: భారతీయ మజ్దూర్ సంఘం(బీఎంఎస్) పిలుపు మేరకు ఇండియన్ నేవీ సివిలియన్ మజ్దూర్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నేవల్ డాక్ యార్డు గేటు ఎదుట నిరసన తెలిపారు. జోరు వానను సైతం లెక్క చేయకుండా రక్షణ రంగ విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు ఆందోళనలో పాల్గొన్నారు. రక్షణరంగ కార్మికులు, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 8వ వేతన సంఘాన్ని వెంటనే నియమించాలని, ఆదాయ పన్ను పరిమితిని రూ.8 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే పెన్షన్ కమ్యూటేషన్ భాగాన్ని 15 ఏళ్లకు బదులు 12 ఏళ్లకు మార్పు చేయడంతో పాటు రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలోని ఖాళీలను భర్తీ చేయాలని నినాదాలు చేశారు. కారుణ్య నియామకాలకు సడలింపు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ఫెడరేషన్ అఖిల భారత కార్యదర్శి ఎస్.రాజేష్, గౌరవాధ్యక్షుడు పి.దేముడునాయుడు నాయకత్వం వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.సురేష్, పి.రాజు, ఆకుల విశ్వేశ్వరరావు, చింతాడ రమణ, పీజీ రెడ్డి, ప్రవీణ్‌కుమార్, లక్ష్మణ్, ఆర్.భాను, శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, దత్త, జగదీష్, ఎంవోపీ వర్క్స్ కమిటీ సభ్యులు సురేష్, మోహన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరాజుపాలెంలో గోరింటాకు సంబరాలు



గోరింటాకు చూపిస్తున్న మహిళలు

విశాఖ విద్య: ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకునేందుకు మహిళలు ఎంతో ఆసక్తి చూపుతారు. ఈ నేపథ్యంలోనే జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో శ్రీ త్రివేణి అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గోరింటాకు సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాలమ్మ-బంగారమ్మ ఆలయంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోనే గోరింటాకు రుబ్బి, మహిళలంతా ముందుగా అమ్మవారికి గోరింటాకు పారాణి పెట్టారు. అనంతరం ఒకరికొకరు గోరింటాకు పెట్టుకున్నారు. ఈ వేడుకతో ఆలయంలో ఆధ్యాత్మికత సంతరించుకుంది. ఆషాఢ మాసంలో ప్రతీ ఏటా ఇదే మాదిరి తమ సంఘం ఆధ్వర్యంలో గోరింటాకు సంబరాలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

గిరి భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు



జోరువానలో గిరి ప్రదక్షిణ ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

- అధికారులకు మేయర్ ఆదేశం
- గిరి ప్రదక్షిణ మార్గం పరిశీలన

డాబాగార్డెన్స్: సింహగిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సింహాచలం తొలి పావంచా నుంచి అడవివరం, హనుమంతువాక, విశాలాక్షీనగర్, అప్పుఘర్, ఇసుకతోట, సీతమ్మధార, మాధవధార, గోపాలపట్నం మీదుగా గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులు వెళ్లే మార్గాన్ని జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గిరి ప్రదక్షిణలో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స కేంద్రాలు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు వంటి ఏర్పాట్లపై మేయర్‌కు అదనపు కమిషనర్ విశ్వనాథన్ వివరించారు. పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన కార్మికులను అందుబాటులో ఉంచామన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు, లుంబినీ పార్కు సమీప బీచ్‌లో స్నానమాచరించే భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆయన చెప్పారు. బీచ్‌లో లైఫ్‌గార్డ్స్‌ను నియమించామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, పలు సేవా సంఘాలకు స్టాళ్ల ఏర్పాటుకు స్థలాలు సూచించామని, ఆహార పదార్థాలు ప్లాస్టిక్‌లో కాకుండా ఆకులు, కాగితంతో తయారు చేసిన ప్లేట్లలో అందించాలని సూచించినట్టు ఆయన తెలిపారు. ప్రసాదం కౌంటర్ల వద్ద, నడక మార్గంలో ఎక్కడికక్కడ డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేశామని అదనపు కమిషనర్ మేయర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

స్టీల్ కార్మికులకు తక్షణం వేతనం చెల్లించాలి

ఉక్కునగరం: స్టీల్ కార్మికులకు తక్షణం వేతనాలు చెల్లించాలని స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని నెలలుగా స్టీల్ కార్మికులకు వేతనాలు చెల్లించడంలో యాజమాన్యం దుర్మార్గమైన వైఖరి అవలంబిస్తోందన్నారు. జీతాల చెల్లింపులో యాజమాన్యం కావాలనే జాప్యం చేస్తోందన్నారు. యాజమాన్యం వైఖరిని ఉక్కు మంత్రి ఎదుట అన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా తప్పుపడితే సగం జీతం చెల్లించిందని గుర్తు చేశారు. వెంటనే సగం జీతాన్ని చెల్లించకుంటే తీవ్ర పరిణామాలు ఎదురోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వై.టి.దాస్, పి. శ్రీనివాసరాజు, బి. అప్పారావు, గంగాధర్, టి.వి.కె.రాజు పాల్గొన్నారు.

ఆటో సుందరం ఉదారత



104 ఏరియా నుంచి ఆటోలో గర్భిణిని ఆస్పత్రికి తరలించిన సుందరం

గోపాలపట్నం: నెలలు నిండిన మహిళను ఉచితంగా తన ఆటోలో కేజీహెచ్ తీసుకు వెళ్లి ఉదారత చాటుకున్నాడు ఉల్లూరి సుందరం. గోపాలపట్నం ఇందిరానగర్‌కు చెందిన ఉల్లూరి సుందరం పేద గర్భిణిలను ఉచితంగా ఆస్పత్రికి తరలించడం తిరిగి తీసుకురావడం వంటి సేవలు చేస్తుంటాడు. అందులో భాగంగా శుక్రవారం వర్షం పడుతున్న నేపథ్యంలో నెలలు నిండి నొప్పులతో బాధపడుతున్న మహిళను కేజీహెచ్‌కు ఉచితంగా తీసుకు వెళ్లాడు. స్థానికంగా ఉన్న ఏఎస్ఎం ఇచ్చిన సమాచారంతో ఆయన తన ఆటోలో ఆస్పత్రికి తరలించాడు. ఇది చూసిన స్థానికులు సుందరంను మెచ్చుకున్నారు.

'ఉక్కు'లో పరిస్థితులు ఆందోళనకరం



దీక్ష శిబిరంలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారంలో నెలకొంటున్న పరిస్థితులు ఆందోళన కల్గిస్తున్నాయని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు, గంగవరం గోపీ అన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షల్లో 1254వ రోజు, శుక్రవారం వారు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని ఏళ్ల నుంచి కోరుతున్నా ప్రభుత్వాలు పట్టనట్టు వ్యవహరిస్తుండడం బాధాకరమన్నారు. ఉత్పత్తి, ఉత్పాదకత, భద్రతా ప్రమాణాలు, ఆర్థిక పరిస్థితి, ముడిసరకు.. ఇలా అన్ని విధాలా ఉక్కును అష్ట దిగ్బంధనం చేసి ఊపిరాడకుండా చేయడం ద్వారా 'ప్రైవేటీకరణ చేసేయండి' అని కార్మికులు, స్థానికులే చెప్పే పరిస్థితికి తీసుకువెళ్తున్నారన్నారు. ప్రభుత్వాలు ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని కుయుక్తులు వేసినా విశాఖ ఉక్కును కాపాడుకుంటామన్నారు. అవసరం వచ్చినప్పుడు రాష్ట్ర ప్రజలు తిరుగుబాటు చేస్తారని, అది ఎవరికీ మంచిది కాదన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జనసేనలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో ఎఫ్ఎండీ, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, సీఎంఈ, వీఎస్‌జీహెచ్, ప్లాంట్ డిజైన్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరంలో పి.రామకృష్ణరాజు, ఎం.ఎస్.రావు, పీజీకే రాజు, మధు, మోహన్, బి.వి.రమణ, గోపాల్, చిన్నయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్ట్

తగరపువలస: భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన ఇద్దరు దొంగలను క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వివరాలను మధురవాడ క్రైమ్ సీఐ జి.రాంబాబు, భీమిలి క్రైమ్ ఎస్ఐ సూర్యప్రకాష్ వెల్లడించారు. నగరంలోని ఆరిలోవకు చెందిన బడీగంటి ప్రణీత భీమిలి మండలం దాకమర్రి విలేజీ హెల్త్ క్లినిక్‌లో హెల్త్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. ఆమె ఈ ఏడాది ఏప్రిల్ 16న దాకమర్రి వద్ద బస్సు దిగి డ్యూటీకి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బుల్లెట్‌పై వచ్చి మెడలో గల అరతులం బంగారు చైన్‌ను తెంపుకుపోయాడు. అలాగే విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన వాడ్రేవు సుజాత ఈ నెల 7వ తేదీన సంగివలస శశి స్కూల్ వద్ద బస్సు కోసం వేచి చూస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలో నుంచి 2.50 తులాల బంగారు పుస్తెలతాడు, నల్లపూసల దండలో కొంత భాగం తెంచుకుపోయారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు భీమిలి పోలీస్ స్టేషన్ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ముద్దాయిలను పట్టుకుని అరెస్ట్ చేసి వారి నుంచి మూడు తులాల బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ముద్దాయిలు నగరంలోని కిన్నెర థియేటర్ ప్రాంతానికి చెందిన గారి గంగులు (ఇతని స్వస్థలం విజయనగరం జిల్లా భోగాపురం మండలం భైరెడ్డిపాలెం), మద్దిలపాలెం శీరపువారి వీధికి చెందిన కోయిలాడ సాయికిరణ్‌లుగా తెలిపారు.

స్వీయ ప్రేరణతో విజయం తథ్యం



సదస్సులో పాల్గొన్న అతిథులు

మల్కాపురం: జీవితంలో విజయం సాధించడానికి స్వీయ ప్రేరణ ఎంతో అవసరమని సీనియర్ హిందీ అధ్యాపకురాలు ఎ.ఆదిలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థినులతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినులు విజయాన్ని సాధించాలనే తపనతోపాటు అవకాశాలను సృష్టించుకో గల శక్తి కూడా కలిగి ఉండాలన్నారు. అడ్డంకులను అధిగమించినప్పుడే దృఢమైన వ్యక్తిత్వం ఏర్పడుతుందని చెప్పారు. ఇతరుల ప్రోత్సాహం కంటే స్వీయ ప్రేరణ మనలను విజయ శిఖరాలకు చేరుస్తుందన్నారు. అనంతరం మూడు రోజులుగా కళాశాల ఆవరణలో వ్యక్తిత్వ వికాసం, మహిళా సాధికారతపై జరిగిన సదస్సుల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు కళాశాల యాజమాన్యం జ్ఞాపికలను అందించింది. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేస్లిన్, సదస్సు కో ఆర్డినేటర్లు ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, ప్రేమలత, డాక్టర్ ప్రశాంతి, అంజలిదేవి తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలు కనుమరుగు



గెడ్డ ప్రాంతంలో నిర్మాణం కోసం వేసిన మట్టి



మూసివేసిన గెడ్డ ప్రాంతం

గోపాలపట్నం: గెడ్డలు, కాల్వలు కబ్జాకు గురవడంతో వర్షం పడితే చాలు నీరు రోడ్డుపైకి వచ్చేస్తోంది. ఈ పరిస్థితి జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే దారిలో నెలకొని ఉంది. ఇక్కడి చర్చి సమీపంలోని గెడ్డను స్థానికులు కొందరు మూసి వేశారు. ఇంటి నిర్మాణం చేపట్టేందుకు మట్టి వేశారు. రెండు రోజులుగా పడుతున్న వర్షాలకు ఎగువ నుంచి వచ్చే నీరు వెళ్లే దారి లేక రోడ్డుపైకి వస్తోంది. దీంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విధంగా మరికొన్ని రోజులు వర్షాలు పడితే దిగువ ప్రాంతాలైన యల్లపువానిపాలెం, చంద్రనగర్ ఎస్సీ కాలనీ ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో దిగువ ప్రాంతాలన్నీ వర్షం నీటితో చిక్కుకున్నాయి. మేహాద్రి గెడ్డ గేట్లు తెరిస్తే మరింత దారుణంగా మారుతుందని వాపోతున్నారు. అధికారులు గతంలో ఇక్కడ పలుమార్లు గెడ్డల ఆక్రమణలపై సర్వే చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెబుతున్నారు. ఇక్కడి పరిస్థితిని ఉన్నతాధికారులు సమీక్షించి కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డ్రైవర్లకు ఉరితాడు వంటి చట్టాలను రద్దు చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న ముజాఫర్

డాబాగార్డెన్స్ : డ్రైవర్లకు ఉరితాడు వంటి చట్టాలను రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజాఫర్, ఆటో రిక్షా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్డు రవాణా డ్రైవర్లకు వర్తించేలా ఏర్పాటు చేసిన మోటార్ ట్రాన్స్‌పోర్టు సవరణ చట్టం 2019, జీవో 21ని రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్‌లో పన్ను మినహాయింపు, సెంక్షన్ 106 (1 అండ్ 2) రద్దు చేయాలంటూ శుక్రవారం అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు శంకర్, విశాఖ జిల్లా మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి.జగన్, అధ్యక్షుడు శివ, కార్యదర్శి అప్పలరాజు సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ రోడ్డు రవాణా డ్రైవర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి ఆయా సెక్షన్లు, చట్టాలు రద్దు చేయాలన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం డ్రైవర్లకు ఉరితాడు బిగించేలా గత ఏడాది డిసెంబర్ 21న చట్టాలు తీసుకువచ్చిందన్నారు. గతంలో ప్రమాదానికి డ్రైవర్ కారణమైతే గరిష్టంగా రెండేళ్ల శిక్ష ఉండేదని, ఇప్పుడు మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ప్రకారం పదేళ్ల జైలు, రూ.7 లక్షల జరిమానా విధించేలా నిబంధనలు తయారు చేశారన్నారు. కొత్త చట్టంలోని నిబంధనల వల్ల బెయిల్ కోసం ఎదురు చూడాల్సి వస్తుందన్నారు. ప్రమాదానికి గురైన వారికి ఉచిత వైద్య సదుపాయం ప్రభుత్వమే భరించాలని, చనిపోయిన వారికి రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, 60 ఏళ్లు దాటిన డ్రైవర్లకు రూ.9 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

వాకింగ్ ట్రాక్ బురదమయం



గుల్లలపాలెం వాకింగ్ ట్రాక్‌పైకి చేరిన మట్టి

మల్కాపురం: ఇటీవల కురుస్తున్న వర్షాలకు 60వ వార్డు గుల్లలపాలెంలోని వాకింగ్ ట్రాక్ పైకి బురద మట్టి చేరడంతో వాకర్లు జారిపడుతున్నారు. స్థానికుల కోసం జీవీఎంసీ అధికారులు గుల్లలపాలెంలో బీటీ వాకింగ్ ట్రాక్ నిర్మించారు. దానిని ఆనుకుని ఐదు అంగుళాల ఎత్తులో మట్టితో కూడిన మరో ట్రాక్ వేశారు. పారిశ్రామిక ప్రాంతంలోని వాకర్లు ఇక్కడ ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి కరిగి రోడ్డుపై నుంచి దిగువ గల బీటీ వాకింగ్ ట్రాక్‌పైకి చేరుతోంది. వాకింగ్ ట్రాక్ బురదమయంగా మారడంతో అక్కడ వాకింగ్ చేస్తున్న జారుతున్నారు. ఆరోగ్యం కోసం వాకింగ్‌కు వస్తే.. జారిపడుతున్నామని పలువురు వాకర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాకింగ్ ట్రాక్‌పై మట్టి చేరకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తుపాను బాధితులకు అన్నదానం



భోజనం వడ్డిస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: తుపాను నేపథ్యంలో రోజు వారీ కూలీలు పనులు లేక ఇళ్ల వద్దే ఉంటున్నారు. వారిని ఆదుకునేందుకు జీవీఎంసీ 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ ముందుకొచ్చారు. వార్డులోని లక్ష్మీనగర్- ఎఫ్ బ్లాక్‌లో పనులు లేక ఇబ్బంది పడుతున్న పలువురికి అక్షయపాత్ర వారితో కలిసి శుక్రవారం మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆపద సమయంలో పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కార్పొరేటర్ రమణ కోరారు. తుపాను వేళ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా ఇబ్బంది ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అధికారులు, ఉద్యోగులంతా అందుబాటులో ఉండి, ప్రజల అవసరాలపై వెంటనే స్పందించాలని కోరారు.

తైక్వాండో కౌన్సిల్ ఆఫ్ ఏపీ అధ్యక్షుడిగా రుక్మాకరరావు

గోపాలపట్నం: తైక్వాండో కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడిగా పాండ్రంగి రుక్మాకరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం తైక్వాండో కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగింది. రుక్మాకరరావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్‌లో జరగబోవు రాష్ట్ర స్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్‌ను గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తామని తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



వృద్ధురాలి మృతదేహం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గుర్తు తెలియని వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 75 సంవత్సరాలు వయసు గల వృద్ధురాలు జీవీఎంసీ పదో వార్డు ఆదర్శనగర్ పరిసరాలలో కొన్నాళ్లుగా యాచన చేస్తుండేది. ఆమె గురువారం మధ్యాహ్నం యచన చేస్తూ స్పృహ కోల్పోయి రోడ్డుపై పడిపోయింది. దీంతో స్థానికులు అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆమె మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. ఆమె వివరాలు తెలియకపోవడంతో బంధువులు ఎవరైనా ఉంటే ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరుతున్నారు.